సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ၊ 13 ၊ మార్చి ၊ 2024



సోమశిలలో 13.416 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 13.416 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 2600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.




బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.67,900
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,098
3 శాతం జీఎస్టీతో..	రూ.6,281
నవర (8 గ్రా)	రూ.50,248

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.7 /25.2

మంగళవారం గాలిలో తేమ 69 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బుధవారం స్వల్ప మార్పులు ఉండ వచ్చని వాతావరణశాఖ తెలిపింది.



న్యూస్‌రీల్

డీసీఓగా గుర్రప్ప



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన డీసీఓ గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా నూతన సహకార శాఖాధికారి (డీసీఓ)గా బి.గుర్రప్పను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన నగరంలోని డీసీఓ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుర్రప్ప డా వైఎస్సార్ జిల్లా డీసీసీ బ్యాంకు ఇన్‌చార్జ్ ఓఎస్డీగా విధులు నిర్వహిస్తూ, పదోన్నతిపై జిల్లా డీసీఓగా నియమితులయ్యారు. ఆయన వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, జేసీని మర్యాదపూర్వకంగా కలిశారు. పలువురు సహకారశాఖ అధికారులు, సిబ్బంది డీసీఓను కలిసి అభినందనలు తెలిపారు.

విజయసాయిరెడ్డితో ఆదాల భేటీ



విజయసాయిరెడ్డిని కలిసిన ఆదాల, ఆనం విజయకుమార్, జయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు కలిశారు.

ఆరోగ్యమిత్ర పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న వైద్యశాఖాధికారులు

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యమిత్ర పోస్టులకు మంగళవారం సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 18 పోస్టులకు గాను 54 మంది హాజరయ్యారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి (డీసీహెచ్ఎస్) డాక్టర్ రమేష్‌నాథ్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులతో కూడిన కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ మాట్లాడుతూ మెరిట్ జాబితాను సిద్ధం చేస్తున్నామని, ఎంపికయిన వారి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు.

భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి

- పోర్టు సీఈఓ జీజే రావు



క్రీడా పోటీల విజేతలతో జీజే రావు

ముత్తుకూరు: అదాని కృష్ణపట్నంపోర్టులో భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు సీఈఓ జీజే రావు అన్నారు. మంగళవారం జరిగిన భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ క్రీడల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ భద్రత విషయంలో ఎవ్వరూ అశ్రద్ధ చేయవద్దని సూచించారు. భద్రతా ప్రమాణాలు పాటించకుంటే సిబ్బందికే కాకుండా సంస్థకు కూడా ఇబ్బందేనన్నారు. అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సీఓఓ రాజన్‌బాబు, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, సేఫ్టీ హెడ్ రామకృష్ణ పాల్గొన్నారు.

పది పరీక్షలకు 34,708 మంది

18వ తేదీ నుంచి ఎగ్జామ్స్ ప్రారంభం

- 176 సెంటర్లలో నిర్వహణ
- జంబ్లింగ్ పద్ధతిలో సీట్లు
- 7 సమస్యాత్మక కేంద్రాలు
- ప్రశ్నపత్రంపై బార్ కోడ్
- వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నెల్లూరు (టౌన్): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఆయా కేంద్రాల సమీపంలోని పోలీసుస్టేషన్లలో భద్రపరిచారు. జిల్లాలో మొత్తం 176 కేంద్రాల్లో, పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. ఉదయం 8.30కే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. పరీక్షలు జంబ్లింగ్ పద్ధతిలో నిర్వహించనున్నారు. హాల్ టికెట్లను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచామని, నేరుగా విద్యార్థులే డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. విద్యార్థుల ఫిర్యాదుల కోసం కంట్రోలు రూంను ఏర్పాటు చేశారు. పరీక్షల్లో సమస్యలపై 9000553515, 8919428319 నంబర్లకు ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరించనున్నారు. ప్రశ్న పత్రాల మీద బార్ కోడ్ ఏర్పాటు చేశారు. ప్రశ్న పత్రం లీకేజీ చేసిన సమయంలో బార్‌కోడ్‌ను స్కాన్ చేసినట్లయితే విద్యార్థి వివరాలు పూర్తిగా బయటకు వస్తాయి.



10వ తరగతి విద్యార్థులు (ఫైల్)

17 వేలకు పైగా బాలికలు

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 34,708 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో రెగ్యులర్ 28,080 మంది, ఒకసారి ఫెయిల్ అయిన వారు 4,666 మంది, ఓఎస్ఎస్‌సీ (రెగ్యులర్) 36, ఓఎస్ఎస్‌సీ (ప్రైవేటు) ఏడుగురు, ఒకేషనల్ 1,919 మంది ఉన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులలో బాలురు 17,671 మంది, బాలికలకు 17,037 మంది ఉన్నారు. జిల్లాలో 7 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. సీతారామపురం, నారాయణరెడ్డిపేట, కలువాయి ఏ, బీ సెంటర్లు, సౌత్ మోపూరు, మర్రిపాడు, రేవూరు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులు ఆదేశించారు. అయితే ప్రస్తుతం నాలుగు సెంటర్లకే అనుమతి వచ్చినట్లు చెబుతున్నారు. పరీక్షలకు నియమించిన ఇన్విజిలేటర్లకు సైతం జంబ్లింగ్ పద్ధతిని అవలంబించనున్నారు. ప్రతి మూడు రోజులకు ఒకసారి ఇన్విజిలేటర్లను మార్చనున్నారు.

18 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఈనెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్నాయి. 10వ తరగతి, ఇంటర్ పరీక్షలను ఒకేసారి నిర్వహించనున్నారు. ఈ పరీక్షల కోసం జిల్లాలో మొత్తం 30 సెంటర్లను ఏర్పాటు చేశారు. పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు మొత్తం 5,304 మంది అభ్యాసకులు హాజరుకానున్నారు. పదవ తరగతికి సంబంధించి 1713 మంది, ఇంటర్‌కు సంబంధించి 3591 మంది అభ్యాసకులు ఉన్నారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ఉండేందుకు 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. పది పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన నియమ, నిబంధనలను అమలు చేయనున్నారు.

పకడ్బందీగా నిర్వహణ

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నారు. పరీక్షల కోసం 176 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 176 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా ఉండేందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 25 సిటింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. డిస్ట్రిక్ట్ అబ్జర్వరుగా జేడీ సర్వీస్ మువ్వా రామలింగంను నియమించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్‌ను అమలు చేస్తారు. పరీక్షా కేంద్రం సమీపంలో ఉన్న ఆన్‌లైన్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేసే సౌకర్యాన్ని కల్పించారు. పరీక్ష సమయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



ఎలాంటి టెన్షన్ లేకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. హాల్ టికెట్లు వెబ్‌సైట్ నుంచి నేరుగా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావచ్చు. ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోలు రూంలోని నెంబర్లకు ఫిర్యాదు చేయాలి. పరీక్షలకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి కూడా మొబైల్ అనుమతి లేదు.

– పీవీజే రామారావు, డీఈఓ

కష్టపడి పనిచేద్దాం.. మరోసారి గెలుద్దాం

- నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- హాజరైన మాజీ ఎంపీ మేకపాటి, నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట): 'ఎన్నికలు సమీపిస్తున్నాయి. కష్టపడి పనిచేసి వైఎస్సార్‌సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొద్దాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంను చేద్దాం' అని నెల్లూరు ఎంపీ, ఆ పార్టీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కేక్ కట్ చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ వైఎస్ జగన్ పేదలకు మంచి చేయాలని లక్ష్యంతో పార్టీని పెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఉమ్మడి నెల్లూరులో పదికి పది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలిచేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం గురించి తెలియజేశారు. జగన్ రాష్ట్రంలోని పేదలకు మేలు జరిగేలా సంక్షేమ పాలన అందిస్తున్నారని తెలిపారు. చంద్రబాబును నమ్మితే వంచనకు గురవుతారన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ద్వారా బడుగు, బలహీనవర్గాల ప్రజలకు జగన్మోహన్‌రెడ్డి ఆశాజ్యోతిలా మారారని తెలిపారు. ఆయన పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎంతో లబ్ధి పొందారన్నారు. వారికి రాజకీయంగా అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు సిటీ సమన్వయకర్తగా సామాన్య వ్యక్తి అయిన ఖలీల్ అహ్మద్‌కు అవకాశం కల్పించడమే ఇందుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నగర మేయర్ స్రవంతి, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, యువత అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ అంజా హుస్సేనీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, రూరల్ సమన్వయకర్త ఆదాల, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు



కస్తూర్బా కళాక్షేత్రం వద్ద భద్రతా ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

నేడు నెల్లూరుకు గవర్నర్ రాక

- పీఎం సూరజ్ ప్రారంభ కార్యక్రమానికి హాజరు
- భద్రతా ఏర్పాట్లు చేసిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం నెల్లూరుకు రానున్నారు. దీంతో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గవర్నర్ పర్యటించే ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. రూఫ్ టాప్‌పై ప్రత్యేక దృష్టిసారించి భద్రతను మరింత పెంచాలన్నారు. రూట్ బందోబస్తులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలనీ, వ్యతిరేక దిశలో వాహనాల రాకపోకలను పూర్తిగా నిరోధించాలన్నారు. అవసరమున్న ప్రతిచోట బ్యారికేడ్స్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలన్నారు. ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య,



ప్రసాద్, శ్రీనివాసరావు, నగర డీఎస్పీ శ్రీనివాస రెడ్డి నగర ఇన్‌స్పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గవర్నర్ పర్యటించే ప్రాంతాల్లో ట్రయల్ కాన్వాయ్ నిర్వహించారు.

గవర్నర్ పర్యటన ఇలా

గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం మధ్యాహ్నం 1.40 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.55 గంటలకు నెల్లూరు పోలీసు కవాతు మైదానంలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి మినర్వాగ్రాండ్‌కు చేరుకుని కొద్దిసేపు సేదతీరుతారు. 3.35 గంటలకు మినర్వాగ్రాండ్ నుంచి బయలుదేరి శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంకు చేరుకుంటారు. 3.40 నుంచి 5.10 వరకు పీఎం సూరజ్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. తొలుత కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక స్టాల్స్‌ను పరిశీలిస్తారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు పత్రాలు, ఆయుష్మాన్ హెల్త్‌కార్డులు, కిట్లు, మెగా చెక్కును అందజేస్తారు. అనంతరం హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో గన్నవరం విమానాశ్రయానికి వెళతారు.

క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటుకు ప్రతిపాదనలు

- డీఎంఈ డాక్టర్ నరసింహ వెల్లడి
- మెడికల్ కళాశాల, ఆస్పత్రి తనిఖీ

నెల్లూరు(అర్బన్): నగరంలోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు డీఎంఈ డాక్టర్ నరసింహ మంగళవారం నెల్లూరు వచ్చారు. ఆయన మెడికల్ కళాశాలతో పాటు జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధరాదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసిందన్నారు. ప్రతి సంవత్సరం క్యాన్సర్ రోగులు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి జిల్లాలో




మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వసుంధరాదేవితో మాట్లాడుతున్న డీఎంఈ డాక్టర్ నరసింహ

క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా నెల్లూరులో ఉన్న వనరులు గురించి పరిశీలించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ గురించి కూడా తెలుసుకున్నారు. ప్రతిపాదనలు కలెక్టర్‌తో చర్చించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు.

మెడికల్ కళాశాలలో వసతుల కల్పనకు అనుమతి

ఈ సందర్భంగా డాక్టర్లు, వైద్య విద్యార్థులు మెడికల్ కళాశాలలో అదనపు వసతుల కోసం డీఎంఈకి వినతిపత్రం ఇచ్చారు. కళాశాలలో లెక్చరర్ గ్యాలరీ, ప్రొజెక్టర్, టీచింగ్ ఎయిడ్స్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే వీటన్నింటికీ డీఎంఈ అప్రూవల్ ఇచ్చారు. మెడికల్ కళాశాల, ఆస్పత్రి అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర, ఆస్పత్రి ఏడీ డాక్టర్ కళారాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాష తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

- మంచినీటి సమస్యలు రానివ్వకండి
- అవసరమైన ప్రాంతాల్లో బోర్లు వేయండి
- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుందని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. మంగళవారం జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్యశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి వైద్యులను నియమించారన్నారు. రాబోవు వేసవికాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా మంచినీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్లు వేయించాలన్నారు. అవసరమైన గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించడం జరిగిందన్నారు. రూ 250.76 కోట్లతో 659 గ్రామ సచివాలయ భవనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటి వరకు 342 భవన నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. రూ 143.01 కోట్లతో 656 రైతు భరోసా కేంద్రాలు ప్రభుత్వం మంజూరు చేయగా 254 నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా చేపట్టిన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి పనుల్లో క్షేత్ర స్థాయిలో పొరపాట్లు జరిగితే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం హౌసింగ్, హార్టికల్చర్, వ్యవసాయం, ఐసీడీఎస్, ఐటీడీఏ తదితర శాఖల అధికారులతో చైర్‌పర్సన్ సమీక్షించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ ప్రక్రియ జిల్లాలో జాప్యం జరుగుతోందని కలువాయి జెడ్పీటీసీ అనిల్‌కుమార్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉదయగిరిలో శ్మశానాలు సరిగాలేవని వాటిని అభివృద్ధి చేయాలని, ఈ ప్రాంతంలో మంచినీటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్ కోరారు. మర్రిపాడు, కలిగిరి జెడ్పీటీసీలు వారి వారి మండలాల్లోని సమస్యలు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. వాటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశాల్లో డిప్యూటీ సీఈఓ బి చిరంజీవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గీతాంజలి మృతిపై నిరసన

- నారా లోకేశ్ దిష్టిబొమ్మ దహనం
- ఐటీడీపీ, జనసేన ట్రోలింగ్‌పై ఆగ్రహం

నెల్లూరు సిటీ: అన్నెంపుణ్యం తెలియని పేదింటి మహిళను సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలు చేసి, మానసికంగా హింసించి ఐటీడీపీ, జనసేన గ్యాంగ్ ఆమె ఆత్మహత్యకు పాల్పడే విధంగా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి పాతపాటి ప్రభాకర్ పేర్కొన్నారు. ముత్తుకూరు గేటు సర్కిల్ వద్ద మంగళవారం సాయంత్రం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నారా లోకేశ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పట్టా ఇచ్చాడని సంతోషంగా చెప్పిన గీతాంజలి అనే మహిళను వేధించి ఆత్మహత్య చేసుకునే విధంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో మహిళలు తలదించుకునే విధంగా టీడీపీ వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన



లోకేశ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

పార్టీల నీచరాజకీయాలను గ్రహించాలన్నారు. మృతి చెందిన మహిళ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అస్లాం, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ నాయకుడు తోఫీ, వరుణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మహిళకు చెక్కు అందజేస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): 'సర్వేపల్లి నియోజకవర్గంలో గిరిజనుల సొంతింటి కలను సాకారం చేసేందుకు చర్యలు తీసుకున్నాం. ఎక్కడా లేని విధంగా ఒక్కో ఇంటి నిర్మాణానికి అదనంగా రూ.15 వేలు ఆర్థిక సాయం చేస్తున్నాం' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో 84 మంది గిరిజనులకు ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.12.60 లక్షలకు సంబంధించిన చెక్కులను మంత్రి మంగళవారం నెల్లూరు డైకస్ రోడ్డులో ఉన్న క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా మహిళలకు ఇళ్ల పట్టాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారన్నారు. ఇంటి నిర్మాణానికి ఒక్కొక్కరికి ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున ఇస్తోందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎస్టీ లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకునేలా దాతల సహకారం, సీఎస్సార్ నిధులతో ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.3 కోట్ల మేర ఇచ్చినట్లు తెలిపారు. సొంత నిధులను కూడా ఇస్తానన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టిన వ్యక్తి చంద్రబాబు

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



రైతు భరోసా కేంద్రం వద్ద సిబ్బందితో ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు: 'చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు అన్నదాతలను తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచారు' అని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇనమడుగు, చెర్లోపాళెం పంచాయతీల్లో రూ.66 లక్షలతో నిర్మాణాలు చేపట్టిన మూడు రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ప్రసన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఆర్బీకే ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వస్తున్న మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం అందజేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేది కాదన్నారు. ప్రస్తుతం 9 గంటలపాటు నిరాంతరాయంగా రైతులకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. గోదాములు నిర్మించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ అధినేత వసంతకుమార్‌రెడ్డి, ఎంపీపీ పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను జగన్ నెరవేర్చారు

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: 'ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. మాట తప్పని వ్యక్తిగా ప్రజల గుండెల్లో నిలిచారు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ చేయూత సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు మండలాల పరిధిలో 12,179 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయం చేశారన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించేందుకు ప్రతి మహిళ సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తమ ప్రభుత్వంపై ప్రజలకు ఎంత నమ్మకం ఉందో నాలుగు సిద్ధం సభల ద్వారా రుజువైందన్నారు. చంద్రబాబు సభలకు ప్రజా స్పందన కరువైందన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు నమ్మారని, వారిని బాబు మోసం చేసినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రజల భవిష్యత్ ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అనేక సంక్షేమ పథకాలను పేదల కోసం అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు కేతా వేణుగోపాల్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, పెయ్యల సంపూర్ణమ్మ, జెడ్పీటీసీలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, పీర్ల పార్థసారథి, పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణమ్మ, సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీఐ కమిషనర్‌కు సన్మానం



భాస్కర్‌రెడ్డిని అభినందిస్తున్న డాక్టర్ ఆదిశేషయ్య తదితరులు

ఆత్మకూరు: రాష్ట్ర సమాచార కమిషనర్‌గా (నాన్ పొలిటికల్) ఆత్మకూరుకు చెందిన డాక్టర్ అల్లారెడ్డి భాస్కర్‌రెడ్డి నియమితులైన విషయం తెలిసిందే. సోమవారం విజయవాడలోని సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన మంగళవారం పట్టణానికి విచ్చేశారు. అంకమ్మతల్లి చెట్టు వద్ద కుటుంబసభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య సన్మానం చేశారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఎ.అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 961 మంది గైర్హాజరు



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్ఐఓ

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 961 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 26,539 మందికి గానూ 25,748 మంది హాజరయ్యారు. 791 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,300 మందికి గానూ 1,130 మంది హాజరయ్యారు. 170 మంది గైర్హాజరయ్యారు. అధికారులు జిల్లా వ్యాప్తంగా 40 కేంద్రాలను తనిఖీ చేశారు. ఎస్పీ ఆఫీసు సమీపంలో పరీక్షల సిబ్బందితో ఆర్ఐఓ శ్రీనివాసులు మాట్లాడారు.

కార్మిక శాఖ సమావేశం



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

నెల్లూరు(దర్గామిట్ట): డీఆర్వో ఎస్.లవన్న ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో మంగళవారం జిల్లా కార్మిక శాఖ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జోన్ సంయుక్త కార్మిక శాఖ కమిషనర్ ఎస్.శ్రీనివాస్ వివిధ అంశాలను వెల్లడించారు. కార్యక్రమంలో నెల్లూరు ఉప కార్మిక కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారిణి సుస్మితారెడ్డి, కార్యవర్గసభ్యులు, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నాయకుడి చేరిక



ఆదాల సమక్షంలో పార్టీలో చేరిన శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని పెనుబర్తిలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకుడు చిరమన శ్రీనివాసులురెడ్డి నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పెనుబర్తి గ్రామంలో మంగళవారం సాయంత్రం ఆదాల పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సమయంలో శ్రీనివాసులురెడ్డి, పలువురు టీడీపీ సీనియర్ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదాల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక మంది తమ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ శ్రీనివాసులురెడ్డి పార్టీలో చేరడం సంతోషంగా ఉందని, పెనుబర్తిలో తెలుగుదేశం తుడిచి పెట్టుకుపోయిందన్నారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

• నెల్లూరు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి
• నగరంలో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని నెల్లూరు నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి అన్నారు. బీఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు కలిసి మంగళవారం నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ నుంచి కేవీఆర్ పెట్రోల్ బంకు వరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రక్షణగా మేమున్నాం.. స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల కేసుల్లో ఉన్న వ్యక్తులను బైండోవర్లు చేశామన్నారు. లైసెన్సు ఉన్న ఆయుధాలను డిపాజిట్ చేసుకున్నామన్నారు. ఎన్నికల వేళ మద్యం రవాణా, అనధికార నిల్వలు, నగదు పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో వాటిని గుర్తిస్తే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ కమాండెంట్ కేపీ కౌర్, నగర ఇన్‌స్పెక్టర్లు బి.అశోక్‌కుమార్, బాబీ, కళ్యాణ్‌రాజు, అల్తాఫ్ హుస్సేన్, పీవీ నారాయణ, వీరానాయక్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మంచి చేశాం కాబట్టే ఓట్లడుగుతున్నాం

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



కలిగిరిలో వలంటీర్‌ను సత్కరిస్తున్న సమన్వయకర్త మేకపాటి

కలిగిరి: 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఎంతో మంచి చేసింది. కాబట్టే ధైర్యంగా వెళ్లి ఓట్లు అడుగుతున్నాం' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కలిగిరిలోని ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లు పని చేస్తున్నారన్నారు. వారిని కించపరిచేలా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాట్లాడారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పిన దాని కంటే ఎక్కువగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ప్రజలు ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తమ కుటుంబం 40 ఏళ్లుగా ప్రజాసేవకు అంకితమైందన్నారు. టీడీపీ అభ్యర్థి ఎన్నికల తర్వాత ఈ దేశంలో కనిపించరన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు సోషల్ మీడియాలో వేధించడంతో గీతాంజలి అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆమె మృతిపట్ల సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ములకా శ్రీనివాసులురెడ్డి, బొర్రా మస్తాన్‌రెడ్డి, దగ్గుమాటి ఆదిశేషారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి బొల్లినేని వెంకటసత్యనారాయణ, సర్పంచ్ రాగి దివ్య, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

• నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్



ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయాల వల్ల ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే చేరాయని వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ సమన్వయకర్త ఖలీల్ అహ్మద్ అన్నారు. నగరంలో 15వ డివిజన్ బాలాజీ నగర్‌లో ఉన్న అన్నపూర్ణ అపార్ట్‌మెంట్స్ వీధి, తుమ్మలకట్ట సంఘం, నక్కలపల్లి సంఘం, సీఆర్పీ డొంక, మసీదు సెంటర్ అలాగే 11వ డివిజన్ పల్లిపాళెం, ఆర్చి సెంటర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024లోనూ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష నాయకులు నాలుగున్నరేళ్లు కనిపించకుండా ఎన్నికల సమయంలో వచ్చి హామీలివ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలను వారు ఏనాడూ పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గణేశం సుజాత, గోతం అరుణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో అధికారులు

నెల్లూరు(క్రైమ్): ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో వెటర్నరీ వైద్యుల రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం నెల్లూరు పోలీసు కవాతు మైదానంలో ప్రారంభమైంది. దీనిని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఆ శాఖ సంచాలకుడు డాక్టర్ ఆర్.అమరేంద్రకుమార్ ప్రారంభించారు. పోటీలు ఈనెల 16వ తేదీ వరకు జరుగుతాయి. ఎస్పీ పశుసంవర్థక శాఖ జిల్లా సంయుక్త సంచాలకుడు డాక్టర్ బి.మహేశ్వరుడు మాట్లాడారు. క్రీడాకారులకు టీ షర్ట్‌లను అందజేశారు. తొలిరోజు పోలీసు కవాతు మైదానంలో, బుజబుజ నెల్లూరులోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో మ్యాచ్‌లు జరిగాయి. నెల్లూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, కర్నూలు జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ వై.కోటేశ్వరరావు, ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ కండక్టర్ మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ కండక్టర్ మృతిచెందిన ఘటన నెల్లూరు డైకస్‌రోడ్డు వద్ద చోటుచేసుకుంది. సౌత్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. పొదలకూరులో ఎ.హరిబాబు (47), మేరీ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కొడుకు, కుమార్తె సంతానం. హరిబాబు ఆర్టీసీలో కండక్టర్. మూడునెలలుగా మెడికల్ లీవ్‌లో ఉన్నారు. సోమవారం పని నిమిత్తం మోటార్‌బైక్‌పై నెల్లూరుకు వచ్చారు. తిరిగి అర్ధరాత్రి ఇంటికి బయలుదేరారు. డైకస్‌రోడ్డు దాటిన అనంతరం స్పీడ్ బ్రేకర్‌ను దాటే క్రమంలో బైక్ అదుపు తప్పింది. దీంతో హరిబాబు కిందపడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ ఎస్సై రాజేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు ప్రణీత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి మంగళవారం జీజీహెచ్‌లో పోస్టుమార్టం చేయించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు.

గుర్తుతెలియని వృద్ధురాలి ఆత్మహత్య



వృద్ధురాలి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో.. కుటుంబసభ్యులు పట్టించుకోలేదో.. ఏ కష్టమొచ్చిందో గానీ గుర్తుతెలియని వృద్ధురాలు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం తెల్లవారు జామున నెల్లూరు వేదాయపాళెం రైల్వేస్టేషన్ వద్ద నెల్లూరు వైపు వచ్చే పట్టాలపై జరిగింది. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై జి.మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆమె వయసు 70 నుంచి 75 ఏళ్లలోపు ఉండొచ్చని భావిస్తున్నారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఘటన పరిసర ప్రాంతాల్లో వివరాల కోసం ఆరా తీశారు. మృతురాలి గురించి తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

హైవేపై లారీని ఢీకొన్న కారు

• ముగ్గురు వ్యక్తులకు తప్పిన ప్రాణాపాయం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మనుబోలు: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. తర్వాత అవతలి మార్గంలో వస్తున్న లారీని ఢీకొంది. దీంతో కారు నుజ్జునుజ్జయింది. ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన మనుబోలు మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ నుంచి బొల్లం వెంకటకృష్ణయ్య, చిన్నం అజయ్ కృష్ణారెడ్డి కారులో చెన్నై వైపు వెళ్తున్నారు. మరో వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో అదుపుతప్పిన కారు వైఎస్సార్ సర్కిల్ డివైడర్ వద్ద ఉన్న పోల్‌ను ఢీకొని అవతలి రోడ్డులో చెన్నై నుంచి నెల్లూరు వైపు వస్తున్న లారీని ఢీకొంది. దీంతో కారు పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో దాని డ్రైవర్ అంబటి ప్రేమ్‌కుమార్, వెంకటకృష్ణయ్య, అజయ్ కృష్ణారెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. కారు ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. కొద్దిసేపు హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్సై అజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో గూడూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి :	రూ.85
సన్నవి :	రూ.75
పండ్లు :	రూ.30

నెల్లూరు పౌల్ట్రీ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	130
లేయర్ (లైవ్) :	73
బ్రాయిలర్ చికెన్ :	230
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	256
లేయర్ చికెన్ :	125